ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ బుధవారం | 1 ఏప్రిల్ 2026 | ■ 12 పేజీలు

ప్రజా పాలన ప్రతిబింబించేలా

## గ్రామసభలు నిర్వహించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- జూన్ 2 నుంచి 'ఇందిరమ్మ జీవిత బీమా'
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం..






## అకాల వర్షంతో

# అన్నదాత విలవిల

### మబ్బులతో రైతుల్లో టెన్షన్.. టెన్షన్..

### మామిడి రైతు.. ఆగమాగం

అకాల వర్షం పండ్ల తోటలపై తీవ్ర ప్రభావం చూపింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో అధికంగా సాగవుతున్న మామిడి తోటలపై ఈదురుగాలుల ప్రభావం పడింది. మామిడికాయలు నేలరాలాయి. సాధారణంగా మే నెలలో మామిడి కాయలకు మంచి ధర వస్తుందన్న రైతులు ఈదురుగాలలు, గాలి దుమారానికి చేతికి వచ్చిన పంట నేలరాలి తీవ్రంగా నష్టపోయామని మామిడి రైతులు చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడి దక్కేలా లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురియడంతో అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చింది. ఈదురుగాలులకు తోడు వడగండ్ల వాన కురవడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే దశలో నేలవాలడంతో అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లినెట్టయింది. చాలా ప్రాంతాల్లో మొక్కజొన్న నేలవాలగా.. మామిడి పిందెలు నేలరాలాయి. చేతికొచ్చే దశలో మొక్కజొన్న దెబ్బతిన్నది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సగటున 11.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దిలావర్‌పూర్ మండలంలో 20.6, దస్తురాబాద్‌లో 17.5, లక్ష్మణచాందలో 17.3, కడెం పెద్దూర్‌లో 14.9, పెంబిలో 14.0, సారంగాపూర్, ఖానాపూర్‌లలో 13.9, నిర్మల్‌లో 13.3 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఆదిలాబాద్ జిల్లాలో సగటున 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గుడిహత్నూర్ 10.4, నార్నూర్, మావల 5.8, ఇంద్రవెల్లి 5.5, ఉట్నూర్ 5.4, ఆదిలాబాద్ అర్బన్ 5.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- ఈదురుగాలుల బీభత్సం.. రైతన్న కన్నీరు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షం
- పంటలు నష్టపోయి నిండా మునిగిన రైతులు
- ఈదురుగాలులు, వడగండ్ల వానతో కన్నీళ్లు
- నేలరాలిన మామిడి.. నేలవాలిన మొక్కజొన్న
- అన్నదాతలను దెబ్బతీసిన అకాల వర్షం
- నష్టం వివరాల సేకరణలో అధికారులు

ఆదుకోవాలని రైతు సంఘాల డిమాండ్



11

### బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక

## కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు
- సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు
- కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఏర్పాట్ల పరిశీలన

బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిది ద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమం తరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన సమీక్షించారు.

### ఎన్నికలకు.. బీఆర్ఎస్

11

## పరిశీలకుల నియామకం

- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి గంగుల కమలాకర్, కొప్పుల
- ఖానాపూర్‌కు జోగు రామన్న, కోవ లక్ష్మి, అనిల్‌జాదవ్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 4న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికలకు పరిశీలకులను నియమించింది.



### 'పోలీస్ అక్క'కు

## జాతీయస్థాయిలో గుర్తింపు

నిర్మల్ జిల్లాలో ప్రజల శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ అమలు చేసిన పోలీస్ అక్కకు జాతీయస్థాయిలో స్కోచ్ అవార్డు సంతోషంగా ఉందని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు.



వివరాలు 2లో

### జిల్లాలో 20% ప్రమాదాల

## తగ్గించడమే లక్ష్యం

జిల్లాలో గణనీయంగా ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం నూతన విధానాలతో ప్రజలలోకి వెళ్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తుంది. అందులో భాగంగానే ఈరోజు ఆదిలాబాద్ పట్టణం నుండి మహారాష్ట్ర-మాండ్వి (కిన్వట్) కి వెళ్లే రహదారిపై రాంపూర్ రోడ్డు ప్రారంభం నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు 40 సూచిక బోర్డులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగానే ఈరోజు తాంసి మండలం పొన్నారి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు లను ప్రారంభించడం జరిగింది. ఆదిలాబాద్ నుండి మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారులలో ఒకటైన ఈ జాతీయ రహదారి పై సూచిక బోర్డులను ఏర్పాటు చేసి గణనీయంగా ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు వ్యవస్థ కృషి చేస్తుందన్నారు. కల్వర్టులు, క్రాసింగ్, బ్రిడ్జిల వద్ద ప్రమాదకర మూల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.






## జిల్లాలో 20% ప్రమాదాల

# మరణాలనుతగ్గించడమే లక్ష్యం

### 40 సైన్ బోర్డులు ఏర్పాటు

### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో గణనీయంగా ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం నూతన విధానాలతో ప్రజలలోకి వెళ్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తుంది. అందులో భాగంగానే ఈరోజు ఆదిలాబాద్ పట్టణం నుండి మహారాష్ట్ర- మాండ్వి (కిన్వట్) కి వెళ్లే రహదారిపై రాంపూర్ రోడ్డు ప్రారంభం నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు 40 సూచిక బోర్డులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగానే ఈరోజు తాంసి మండలం పొన్నారి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు లను ప్రారంభించడం జరిగింది. ఆదిలాబాద్ నుండి మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారులలో ఒకటైన ఈ జాతీయ రహదారి పై సూచిక బోర్డులను ఏర్పాటు చేసి గణనీయంగా ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు వ్యవస్థ కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే కల్వట్ల వద్ద, క్రాసింగ్ వద్ద, బ్రిడ్జిల వద్ద, గ్రామాల వద్ద మరియు ప్రమాదకర మూల మలుపుల వద్ద వాహనదారులకు అర్థమయ్యేలా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాల లో మరణాలను 20% తగ్గించడమే లక్ష్యం అని ప్రతి గ్రామం నందు ప్రతి వాహనదారునికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్య పరుస్తుంది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ లాంటివి చేయవద్దని తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించడం ద్వారా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా




ఉన్నందున వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపవద్దని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం సమయాలలో అన్ని రహదారులపై పోలీసు సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రమాదాలను అరికట్టేందుకు తమ వంతు పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కే ఫణి ధర్, ఎస్సై తాంసి ఎస్ జీవన్ రెడ్డి, పున్నారి గ్రామ సర్పంచ్ భూమన్న, ఉపసర్పంచి రామిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నటరాజ కళాక్షేత్రం విద్యార్థుల ప్రతిభకు జాతీయ స్థాయి గుర్తింపు

**జన్నారం, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

హైదరాబాదులోని రవీంద్ర భారతిలో కీర్తి అకాడమీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో నటరాజ కళాక్షేత్రం (జన్నారం, లక్సెట్టిపేట) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బాల పురస్కార్ అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డులను మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి చేతుల మీదుగా స్వీకరించడం విశేషంగా నిలిచింది. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు డా. నర్మద విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి వెళ్లాలని మరిన్ని ప్రముఖ వేదికలపై రాణించాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో నటరాజ కళాక్షేత్రానికి మరింత గౌరవం లభించిందని వారు అన్నారు. జన్నారం లక్షెట్టిపేట మండలాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం పట్ల పలు మండలాల ప్రముఖులు అభినందనలు తెలియజేశారు

## ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# బాదంపల్లి పాఠశాలకు 60 బెంచీలు అందజేత

**జన్నారం, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

వాలా విజయ జగన్నాధ రావు జ్ఞాపకార్థం ప్రతిమ ఫౌండేషన్ కరీంనగర్ వారి సౌజన్యంతో బోయినపల్లి ఉషారాణి బోయినపల్లి హరిణి వాల అశోక్ రావు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బాదంపల్లిలో పలు అభివృద్ధి పనులను చేయడానికి ముందుకు వచ్చి బాదంపల్లి ప్రాథమిక పాఠశాల కు మంగళవారం రోజు 60 డ్యూయల్ డెస్క్ బెంచ్ లను పంపిణీ చేయడం జరిగింది . ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ పిల్లలు శ్రద్ధగా చదువుకొని క్రమశిక్షణతో మెదులుతూ ప్రయోజకులు కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి సామల్ల విజయలక్ష్మి లక్ష్మీరాజం మరియు వీడీసీ చైర్మన్ అండ్ వైస్ చైర్మన్ కాసెట్టి లక్ష్మణ్ బెడద సత్తయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్ సీనియర్ ఉపాధ్యాయులు విద్యాసాగర్ పంచాయతీ సెక్రటరీ సంతోష్



ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ మల్యాల మహేష్ మల్యాల తిరుపతి మాజీ ఎంపీటీసీ కాసు వెంకన్న డీలర్ రమేష్ కాసెట్టి వెంకన్న కాసెట్టి తిరుపతి మిగతా గ్రామస్తులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. దాతలకు గ్రామస్తులు ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేలకొరిగిన మొక్కజొన్న

**జన్నారం, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాలవర్షం రైతన్నకు గుండె కూత మిగిల్చింది రోటీగూడలో 30ఎకరాలు మొక్కజొన్న పంటను కౌలుకు చేసుకుంటున్న రైతన్నలకు సోమవారం రాత్రి బారి ఈదురుగాలులతో వర్షం కురవడంతో 30 ఎకరాల మొక్కజొన్నపంట నేలకొరగడంతో రైతు బాధ వర్ణనాతీతం ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలనీ కౌలు రైతులు. ప్రభుత్వాన్ని వేడుకున్నారు





# పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంపై దృష్టి సారించాలి

### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. పదవీ విరమణ పొందిన ఇరువురు అధికారులకు జిల్లా ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి కుటుంబ సభ్యుల సమక్షంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని శాలువా పూలమాలతో సత్కరించి, బహుమతి ప్రధానం చేసి సన్మానించారు. ఉద్యోగం నందు భర్త ఎలాంటి చింతలు లేకుండా విధులు నిర్వర్తించాలంటే భార్య సహకారం ఎంతగానో ఉంటుందని, భార్యాభర్తలు ఇద్దరిని సత్కరించడం జరిగింది. ఇరువురు అధికారులు సుదీర్ఘకాలం పాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి ఈరోజు పదవి విరమణ పొందడంతో వారు చేసిన సేవలను పోలీసు వ్యవస్థ చిరకాలం గుర్తించుకుంటుంది అన్నారు. సంఘవిద్రోహశక్తులతో పోరాటంలో, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు నివారించడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బంది, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా, సర్వీస్ నందు ఎలాంటి రిమార్కులు లేకుండా పదవీ విరమణ పొందడం గర్వకారణం. 1983 సంవత్సరంలో పోలీసు వ్యవస్థలోకి కానిస్టేబుల్ గా అడుగుపెట్టి అంచలంచలుగా 1993 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్ గా, 2003 సంవత్సరంలో ఏఎస్ఐ, గా 2012 సంవత్సరంలో ఎస్సైగా, 2021 సంవత్సరంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది జిల్లా ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకొని ఈరోజు పదవీ విరమణ పొందడం జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నందు ఉన్న పోలీస్ స్టేషన్లో చురుకుగా విధులు నిర్వర్తిస్తూ అధికారుల ప్రశంసలను, మన్నులను పొందడం జరిగింది. స్వస్థలం ఉట్నూర్ మండలం ఎంథా గ్రామానికి వ్యక్తి, ఉట్నూర్ మండల కేంద్రంలో స్థిరపడినారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, అదనపు ఎస్పి అడ్మిన్ పి మౌనిక, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, గిన్నెల సత్యనారాయణ, సిసి కొండరాజు, జస్వాల్ కవిత, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు వ్యసనాల నుండి విముక్తి కల్పించడమే లక్ష్యం

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడం తో పాటు, వాటికి బానిసైన వ్యక్తులను సాధారణ జీవితంలోకి తీసుకురావడం లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ చర్యలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్థానిక రిమ్స్ ప్రాంగణంలో గల డవ్ డి-అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న చికిత్సా విధానాలు, సౌకర్యాలను పరిశీలించారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తులకు వైద్య సలహాలు, కౌన్సెలింగ్ ద్వారా చికిత్స అందిస్తూ వారిని ఆరోగ్యవంతమైన జీవన విధానంలోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు, యువత తీవ్రంగా



ప్రభావితమవుతున్నందున ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులను దూరం చేయడానికి కుటుంబ సభ్యులు, సమాజం సహకారం అవసరమని, అలాంటి వారిని డి-అడిక్షన్ కేంద్రాలకు తీసుకువచ్చి చికిత్స చేయించాలన్నారు. జిల్లాలో



మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు కె నాగరాజు, కె స్వామి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆసిఫాబాద్ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో గందరగోళం

## మున్సిపల్ బడ్జెట్ సమావేశం

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గజానంద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశం రసాభాసగా కొనసాగింది. తమకుకనీసం మర్యాద ఇవ్వడం లేదని కాంగ్రెస్ కౌన్సిల ర్లు అబ్దుల్లా, కార్తీక్, వినోద్, గోవింద్, తారాబాయి, పుష్పలత, భారతి, భాగ్యలక్ష్మి, కృష్ణమ్మ, స్వప్నరాణి నిరసన వ్యక్తం చేసి సమావేశాన్ని బహిష్కరించారు. కాగా మొదటి బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన పది మంది కౌన్సిలర్లం హాజరైతే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని చెప్పారు. కమిషనర్ గజానంద్ తీరుపై కౌన్సిలర్లు మండి పడ్డారు. కేవలం లక్ష రూపాయలు మాత్రమే ఖర్చయే చోట నాలుగు లక్షలు ఖర్చు చేసినట్లు చూపి చైర్మన్ గది సిద్ధం చేశారని, కానీ దానిలో సమావేశం పెట్టక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ నిబంధనలు కనీసం పాటించడం లేదన్నారు. బడ్జెట్ ఎజెండా కూడా తమతో చర్చించలేదని తెలిపారు. మొదటి సమావేశంలో కమిషనర్ అవగాహన లేకుండా వ్యవహరించడంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

**వేచి చూసినా కాంగ్రెస్ కౌన్సిలర్లు..**

కాంగ్రెస్ కౌన్సిలర్లు లేకుండా సమావేశం ప్రారంభించడంతో కొద్ది సేపు కార్యాలయం ఎదుట అనంతరం కమిషనర్ గదిలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎదురు చూశారు. కమిషనర్ గదిలో కుర్చీలు కూడా లేక పోవడంతో కౌన్సిలర్లు నిలబడి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. అక్కడి నుంచి సమావేశ గదిలోకి వెళ్లి తమకు కనీసం మర్యాద ఇవ్వలేదని నేలపై కూర్చొని అదనపు కలెక్టర్ డేవిడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో నిరసన తెలిపారు. కాగా కమిషనర్ తీరుపై మండి పడ్డ కాంగ్రెస్ కౌన్సిలర్లు చివరకు మొదటి బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరణతో ముగించారు. బడ్జెట్ సమావేశాల్లో కేవలం చైర్మన్‌కు మాత్రమే ప్రత్యేక కుర్చీ వేయాల్సిన కమీషనర్ వైస్ చైర్మన్‌కు కూడా కుర్చీ వేయడం ఏంటని ప్రశ్నించారు. చైర్మన్ గదిలో ఎమ్మెల్యే ఫొటోపై మార్చి 6వ తేదీన కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రభుత్వానికి నివేదించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ చెప్పారని అన్నారు. దానిపై ఏ నిర్ణయం తీసుకోక పోవడం బాధకరమన్నారు. అధికార పార్టీ కౌన్సిలర్ల పరిస్థితి ఇలా ఉంటే మున్సిపాలిటీలో అభివృద్ధి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చంటూ ఎద్దేవా చేశారు. కాగా సమావేశం బహిష్కరణ తరువాత కౌన్సిలర్లు నేరుగా వెళ్లి జిల్లా కలెక్టర్ కె హరితకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం..**

కొత్తగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ప్రథమ బడ్జెట్ రూ. 37.80 కోట్లతో కౌన్సిల్ ఆమోదించింది.



మున్సిపాలిటీగా ఆవిర్భావించిన తరువాత ఎన్నికలు జరిగి పూర్తి కౌన్సిలర్ ఆధ్వర్యంలో మొదటి బడ్జెట్ సమావేశాలు పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ డేవిడ్, వైస్ చైర్మన్ అహ్మద్, కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు హాజరయ్యారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లతోనే మున్సిపల్ ప్రథమ బడ్జెట్ రూ. 37.80 కోట్లతో కౌన్సిల్ ఆమోదించింది.

# బట్టుపల్లి చౌరస్తాకు కావేటి సమ్మయ్య నామకరణం



## మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

**కాగజ్‌నగర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ పట్టణంలోని భట్టుపెల్లి చౌరస్తాకు సిర్పూరు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ కారుడు, ప్రముఖ వ్యాపారి కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేస్తూ మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మాణించింది. వార్డు నెంబర్ 6, 7ల పరిధిలో ఉన్న ఈ చౌరస్తాకు తన తండ్రి గారైన మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేయాలని వార్డు నెం.17 కౌన్సిలర్ కావేటి విజయ్ కుమార్ కోరిన నేపథ్యంలో దీనికి నామకరణం చేస్తూ కౌన్సిల్ తీర్మాణించింది. కావేటి సమ్మయ్య విగ్రహాన్ని కూడా ఆ చౌరస్తాలో నెలకొల్పాలని పలువురు కౌన్సిలర్లు చేసిన సూచన మేరకు విగ్రహం ఏర్పాటుకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

**ఉద్యమకారునికి అసలైన గౌరవం దక్కింది: ఎమ్మెల్సీ విఠల్**

'మలి విడత తెలంగాణ ఉద్యమంలో కావేటి సమ్మయ్య గారి పాత్ర ఎనలేనిది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సిర్పూరు నియోజకవర్గంలో ఆయన చేసిన ఉద్యమాలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రాముఖ్యతను తెలిపాయ'ని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో భట్టు పెల్లి చౌరస్తాకు కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో భాగంగా కావేటి సమ్మయ్య నల్లటి షర్టు ధరించి అసెంబ్లీ పైకి ఎక్కి చేసిన నిరసన రాష్ట్ర ఉద్యమాన్ని ప్రభావితం చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విలువ ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి సముచిత గౌరవాన్ని కల్పించిందన్నారు.



## చాందా-టి గ్రామంలో 'సాయి వినాయక ఇండస్ట్రీస్' ప్రారంభం

### యూనిట్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ గ్రామీణ మండలం చాందా-టి గ్రామంలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 'సాయి వినాయక ఇండస్ట్రీస్' యూనిట్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. రిబ్బన్ కత్తిరించి పరిశ్రమను అధికారికంగా ప్రారంభించారు. పారిశ్రామికవేత్త రాజ్ కుమార్ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ యూనిట్‌కు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రామ్‌నగర్ శాఖ ఆర్థిక సహాయం అందించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. యువత ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక రంగంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజీబీ బ్రాంచ్ మేనేజర్ మధుసుధన్, సీనియర్ మేనేజర్అరుణ్ కుమార్, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# అహింస, సత్యం మార్గంలో పయనించడమే భగవాన్ మహావీరునికి ఇచ్చే అసలైన నివాళి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

అహింస, సత్యం మార్గంలో పయనించడమే భగవాన్ మహావీరునికి ఇచ్చే అసలైన నివాళి అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. స్థానిక రాణిసతిజీ కాలనీలోని మహావీర్ భవన్‌లో మంగళవారం భగవాన్ మహావీర్ స్వామి జన్మ కళ్యాణక్ మహోత్సవం (మహావీర్ జయంతి) వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, జైన్ సమాజం పరిమాణంలో చిన్నదైనప్పటికీ, వారు పాటించే సూత్రాలు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. భగవాన్ మహావీరుడు బోధించిన సత్యం, అహింస అనే సూత్రాలు కేవలం జైన్ సమాజానికి మాత్రమే పరిమితం కాదని, అవి యావత్ మానవాళికి దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. గతంలోనూ ప్రధానమంత్రి జైన్ సమాజం యొక్క ప్రాముఖ్యతను వివరించారని గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ తమ వృత్తిలో భాగంగా పేదలకు, అట్టడుగు వర్గాలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వైద్యులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, వ్యాపారవేత్తలు పేదలకు పౌష్టికాహారం అందించడం వంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. మహావీర్ జయంతి రోజున అహింసను చాటిచెప్పేలా మాంసాహార విక్రయశాలలను మూసివేయడంపై అమలు చేసే దిశగా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. "జీవించు - జీవించనివ్వు" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, మనుషులకే కాకుండా మూగ జీవాలకు, ప్రకృతికి కూడా హాని తలపెట్టకూడదని ఉద్ఘాటించారు. జైన్ సూత్రాలను చిన్నతనం నుంచే పిల్లల్లో పెంపొందించడం ద్వారా వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం జైన్ సమాజం ప్రతినిధులు కలెక్టర్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జైన్ సమాజం ప్రతినిధులు అజయ్ కుమార్ బోగవత్, రుషబ్ కందర్, విపుల్ కందర్, ధరమ్ చాంద్ చౌదరి, భక్తులు, అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.







## అకాల వర్షంతో రైతన్నకు అపార నష్టం

**కుభీర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలో సోమవారం రాత్రి బలమైన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం రైతన్నలకు కన్నీరు మిగిల్చింది. కుభీర్ తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలతోపాటు కూరగాయ పంటలు దెబ్బతినడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. కష్టపడి పండించిన పంటలు కండ్ల ముందే నేల వాలడంతో మండల రైతాంగం లబోదిబో మంటున్నారు. అల్పపీడనం ప్రభావంతో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో గోడ్సురా, గోడపూర్, సాంగ్వి గ్రామాలలో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. నిగ్వా, పల్సి, పార్డి కె, పార్డి బీ, దొడర్ణ, దాని అనుబంధ తండాలు, సిరిపెల్లి గిరిజన తండాలు, బెల్గాం, చాత, కుప్టి, వర్ని, మలేగాం, సోనారి, గోడాపూర్, గోడ్సేరా, సాంగ్వి, సిరిపెల్లి హెచ్ తదితర గ్రామాల్లో గాలి వర్ష తీవ్రతకు చేతికి వచ్చిన పంటలు నేల రాలిపోయాయి. అకాల వర్షానికి నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇంత జరిగినా ఏ గ్రామానికి ఇంతవరకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వెళ్లి ఫీల్డ్ విజిట్ చేయకపోవడం పట్ల ఆయా గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 12:00 దాటుతున్న క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటించక పోవడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంట వివరాల నివేదికలు తయారుచేసి జిల్లా అధికారులకు అందించి పరిహారం అందించాలని మండల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిణి సారికను వివరణ కోరగా చాలా గ్రామాలలో జొన్న, మొక్కజొన్న పంటలు గాలులకు నేలవాలి నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చాం. మండలంలోని ఏఈఓ లను ఫీల్డ్ విజిట్ చేసి నివేదికను పంపమని చెప్పామని సాయంత్రం వరకు ప్రాథమిక అంచనా రిపోర్టును ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

# షెడ్యూల్డ్ కులముల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని షెడ్యూల్ కులమునకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక పురోగతి పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా రంగం ఎలక్ట్రికల్ లో ఈ.వి. 2 వీలర్ ను 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం కల్పించి సగటు యూనిట్ ధర 1 లక్ష రూపాయలతో 180 యూనిట్లు, ఈ. వి. త్రిచక్ర వాహనం (సరుకు రవాణా/ప్రయాణికుల రవాణా) ను 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం కల్పించి సగటు యూనిట్ ధర 3 లక్షల రూపాయలతో 89 యూనిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ పథకాలలో సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగం ను 100 శాతం కార్పొరేషన్ రాయితీ కల్పించి సగటు యూనిట్ ధర 3 లక్షల రూపాయల నుండి 7 లక్షల రూపాయల వరకు 19 యూనిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. పశు సంవర్ధక పథకాలలో 70 శాతం కార్పొరేషన్ రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం కల్పించి సగటు యూనిట్ ధర 2 లక్షల 40 వేల రూపాయలతో 96 యూనిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలలో భాగంగా నిరుద్యోగ యువతీ యువకులకు తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ / టామ్ కామ్/ ప్రధానమంత్రి అజయ్ పథకాల క్రింద జాతీయస్థాయి శిక్షణ సంస్థల ద్వారా వేతన ఉపాధి కొరకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు, కుల ధ్రువీకరణ పత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత), ఆదాయ ధ్రువీకరణ పత్రం (మీ సేవ ద్వారా జారీ, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయలకు లోబడి), వ్యవసాయేతర పథకాలకు అభ్యర్థుల వయసు 21-50 సం.లు, వ్యవసాయ పథకాలకు 21-60 సం.లు ఉండాలని తెలిపారు. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు), షెడ్యూల్డ్ కులాల పారిశ్రామికవేత్తలు/ గిగ్ వర్కర్లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంపు సెట్ కోసం కనీసం 2 ఎకరాల భూమి అవసరం), బోరు బావి, నీటి లభ్యతను నిర్ధారిస్తూ గ్రామ కార్యదర్శి నుండి ధ్రువీకరణ పత్రం



సమర్పించాలని, సదరం సర్టిఫికెట్ (దివ్యాంగుల కొరకు), పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఉండాలని తెలిపారు. పాడి పశువుల పథకం కొరకు పశుగ్రాసం పెంచడానికి కనీసం 10 గుంటల సాగునీటి సౌకర్యం ఉన్న సొంత/కౌలు భూమి కలిగిన షెడ్యూల్డ్ కులముల లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఏప్రిల్ 8వ తేదీ లోగా వాదీవీమీ పోర్టల్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసిన దరఖాస్తులను డౌన్ లోడ్ చేసుకొని సరైన ధ్రువపత్రాలు జత చేసి సంబంధిత మండలం/మున్సిపాలిటీ కార్యాలయాలలో సమర్పించాలని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# దొంగతనాన్ని అడ్డుకున్న మహిళా కార్మికురాలు



**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడటంలో ఓ మహిళా కార్మికురాలు చూపిన ధైర్య సాహసాన్నీ అందరూ ప్రశంసిం చాలి. వివ రాలిలావున్నాయి. మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ బేస్ వర్క్షాప్ జనరల్ అసిస్టెంట్ ఎం. శ్రీలత పనిచేస్తున్నారు. కేకే ఓపెన్ కాస్ట్ బేస్ వర్క్షాప్‌లో మొదటి షిఫ్ట్‌లో ఉన్న శ్రీలత, వర్క్‌షాప్‌లోని విలువైన సామాగ్రిని అదే గనిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి దొంగతనంగా తరలిస్తుండటం గమనించారు. ఏమాత్రం తడబడకుండా ఆమె సదరు వ్యక్తిని పట్టుకొని, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆమె సమయస్ఫూర్తి ధైర్య సాహసం సంస్థ ఆస్తి చోరీకి గురికాకుండా అడ్డుకుంది. ఈ విషయంలో శ్రీలత ప్రదర్శించిన ధైర్యశీ, బాధ్యతాయుత ప్రవర్తనను గుర్తించిన ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, మంగళవారం తన కార్యాలయంలో ఆమెకు "ప్రశంసా పత్రం" అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. సంస్థ పట్ల అంకితభావంతో పనిచేసే ఇలాంటి కార్మికులు అందరికీ ఆదర్శమని కొనియాడారు. విధుల్లో అప్రమత్తంగా ఉండి సంస్థ ఆస్తులను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యులపై దాడులు చేయడం సరికాదు

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలో ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వైద్యులపై కొందరు దాడులు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీహరి రావు అన్నారు. మంగళవారం దాడి జరిగిన పిల్లల వైద్యులు సంతోష్ రాజు ఆసుపత్రిని సందర్శించి జరిగిన సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ భీమ్ రెడ్డి. దేవరకోట చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు



## అకాల వర్షానికి వరి పంటకు తీవ్ర నష్టం

**లోకేశ్వరం, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

అకాల వర్షానికి వరి రైతులు అరిగోస పడుతున్నారు. లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్, జోహార్ పూర్, వాస్తాపూర్, ధర్మోరా ,పంచగుడి తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పైరు నేలకొరిగింది. వరి కంకి పాలు పోసుకునే దశలో ఉండడం వల్ల నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లే ఆస్కారం ఉన్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20,000 వరకు పెట్టుబడి పెట్టడం జరిగిందని, దీనితో సగం దిగుబడులు తగ్గిపోయేలా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## కేవీకేలో పంట మార్పిడి పైన అవగాహన సదస్సు

**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

కన్నాల రైతు వేదికలో రైతులకు పంటల విభిన్నీకరణపై అవగాహన కల్పించారు. బెల్లంపల్లి కేవీకే ఆధ్వర్యంలో మంగళవారం అవహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కేవికే ప్రోగ్రామ్ సమన్వయకర్త డా. ఎం. ప్రసూన పాల్గొని రైతులకు పంటల మార్పిడి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా, వాతావరణ మార్పులు మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పలు పంటలను సాగు చేయడంతో రైతులు లాభాలను పెంచుకోవచ్చని తెలిపారు. శాస్త్రవేత్త డా. ఎన్. మహేష్ జిల్లాలో పంటల మార్పిడి కి అనువైన ప్రత్యామ్నాయ పంటలు, వాటి సాగు పద్ధతుల (ప్యాకేజ్ ఆఫ్ ప్రాక్టీసెస్) గురించి రైతులకు సమగ్రంగా వివరించారు. డా. యు. శ్రావంతి ఆయిల్ పామ్ సాగులో అనుసరించాల్సిన నిర్వహణ పద్ధతులను వివరించి, రైతులు ఈ పంట ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ప్రేమ్ కుమార్, ఫర్హీన్, ఉద్యానవన శాఖ అధికారి అర్చన పాల్గొన్నారు.

# ప్రమాదాలలో ప్రాణనష్టాన్ని తగ్గించడమే లక్ష్యం

**రోడ్డుపై బాధ్యతగా వెళ్లండి - క్షేమంగా ఇంటికి తిరిగి రండి**

**రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించండి**

**ఆటో, టాక్సీ, లారీ, కార్ డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు.**

**నిష్ణాతులైన వైద్యులచే కంటి పరీక్షల నిర్వహణ.**

**30 డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాల అందజేత.**

**ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర డిజిపి డి శివధర్ రెడ్డి గారిచే ప్రారంభించబడిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం సందర్భంగా ఈరోజు మధ్యానం ఉట్నూర్ మండల కేంద్రంలోని హెచ్కేజిఎన్ గార్డెన్ లో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ, లారీ, కార్ డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ వాహన నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల లో ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మంచి కంటి చూపుతో ప్రమాదాల



నివారణ సాధ్యం అని తెలిపారు. ఆటోలలో ఇలాంటి అసంఘిక కార్యకలాపాలు చేయవద్దని, డ్రైవర్లకు ఎలాంటి అనుమానం ఉన్న వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయాలని తెలిపారు. ఈ ఉచిత కంటి పరీక్ష లో బోథ్ చెందిన 230 మంది ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లు పాల్గొన్నట్లు తెలిపారు. వీరందరికీ నిష్ణాతుడైన కంటి వైద్యులు డాక్టర్ సంధ్య పుష్కర్ ఆప్తమాలజీ, వైద్య పరీక్షలను నిర్వహించినట్లు, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పరీక్షలను పరిశీలించి, నిరుపేద 30 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను ఇచ్చారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నవారికి ఆదిలాబాద్ పట్టణంలో ఉచితంగా వైద్య సేవలు అందించనునట్లు తెలిపారు. ముఖ్యంగా ఆటోలలో టాక్సీలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, గంజాయి మాదకద్ర వ్యాలు లాంటి వాటివి తరలకుండా, నిషేధిత పదార్థాలను, వస్తువులను, వాటిని రవాణా చేయకుండా ఉండాలని తెలిపారు. డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఎస్ఐ జి విజయ్, ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ సాయన్న, నార్నూర్ ఎస్సై శ్రీ సాయి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ శాంతరాజ్, ఆటో డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహంకాళి జాతరకు వేళాయె

రెబ్బెన, మార్చి 31 (ప్రభాత సమాచారం)

రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని ఉన్న కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయం జాతరకు సిద్ధమవుతోంది. ఇద్దరు అమ్మలు కొలువైన పుణ్యక్షేత్రం, స్వయంభూగా వెలసిన మహంకాళి అమ్మవారితో పాటు కనకదుర్గాదేవి కొలువుదీరిన దేవస్థానం. ఉమ్మడి జిల్లాలోనే మహంకాళి అమ్మవారు స్వయంభూగా వెలిసిన ఆలయం కావడం ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాతో పాటు పక్క జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. చైత్ర పౌర్ణమి రోజున మహంకాళి అమ్మవారి పుట్టిన రోజు జాతర ప్రారంభమ వుతుంది. మూడు రోజుల పాటు ఆలయంలో అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



**మూడు రోజుల పాటు జాతర..**

అమ్మవారి జాతర గురు, శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తారు. మొదటి రోజు శివపార్వతుల కల్యాణం, రెండో రోజు అమ్మవారికి బోనాల సమర్పణ, వన భోజనాలు, మూడో రోజుల అమ్మవారి దర్శనం. చైత్రపౌర్ణమి రోజున అమ్మవారిని దర్శించుకుంటే కోరిక కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం, మహంకాళి అమ్మవారు ఆలయంలో కొలువుదీరిన తీరు, ఆలయ నిర్మాణం, స్థల పురాణంపై గ్రామస్తులు ఈ విధంగా చెప్పుకుంటారు. ఒకప్పుడు రెబ్బెన పరిధిలో అటవీ ప్రాంతం అధికంగా ఉండేది. పెద్దపులితో పాటు అనేక రకాల కృరమృగాలు సంచరిస్తుండేవి. ఆదివాసీ గరిజనులతో పాటు ఇతరులు సైతం అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తుండేవారు. ఈ క్రమంలో అడవిలోకి రాక పోకలు సాగించే సమయంలో తమను అటవీ జంతువుల నుంచి కాపాడాలని మహంకాళి అమ్మవారికి మొక్కేవారు. అమ్మవారి దయ ఉంటే తమకు ఎలాంటి హాని కలగదని వారి నమ్మకం. మహారాష్ట్రలోని చంద్రాపూర్ మహంకాళి అమ్మవారు కొలువై ఉన్న మాదిరిగానే ఇందిరానగర్‌లో కొలువైన అమ్మవారిని నైవేధ్యాలతో మొక్కలు చెల్లించుకునేవారు. అలా భక్తుల పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహం కొన్నేళ్లకు అతివృష్టి కారణంగా నీటిలో మునిగి పోయింది. ఆ స్థలంలోనే పుట్ట ఏర్పడింది. చైత్ర మాసం పౌర్ణమి సమయానికి పుట్ట సంపూర్ణ ఆకారంలో భక్తులకు కనిపించగా భక్తులు అక్కడే పూజలు చేసేవారు. కాగా కాగజ్‌నగర్‌లోని బారెగూడకు చెందిన మొర్లె నారాయణ, లక్ష్మిల దంపతుల కుమారుడు వినోద్ అనే వ్యక్తికి 2014లో ఒక రోజు రాత్రి ఆయనకు కలలో పాము రూపంలో అమ్మవారు కనిపించిందని చెబుతుంటారు. ఇందిరానగర్ పుట్టలో ఉన్న తనను బయటకు తీసి పూజలు చేయమని చెప్పారట. మరుసటి రోజు నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఉదయం రాత్రి తొమ్మిది బిందెల చొప్పున పుట్టపై నీళ్లు పోయగా చైత్రపౌర్ణమి తరువాత అమ్మవారి శిలావిగ్రహం బయటపడింది. అప్పటివ నుంచి గ్రామస్తులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2015లో వినోద్ చిన్న ఆలయం నిర్మించి మహంకాళి అమ్మవారితో పాటు కనకదుర్గాదేవి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. కాగా ఆలయం వెనక భాగంలో భూగర్భంలోకి గుహలో కొలువుదీరిన మహంకాళి అమ్మవారి విగ్రహం ప్రత్యేక ఆకర్ణగా నిలుస్తోంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్(చాందా) మహంకాళి ఆలయంలో ఉన్న మాదిరిగానే ప్రధాన ఆలయం వెనక భాగంలో పది ఫీట్ల లోతులో గుహను ఏర్పాటు చేసి అందులో పడుకుని ఉన్నట్లు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో 21 ఫీట్ల ఎత్తులో ఏర్పాటు చేసిన మహంకాళి విగ్రహంతో పాటు 15 ఫీట్ల నాగదేవత విగ్రహా లు, శనేశ్వరుడి ఆలయం, కాలభైరవుడు, అరుణాచలం శివుడి ఆలయాలు ఉన్నాయి.



## ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

# విజయవంతంగా కొనసాగించాలి

### గ్రామ, వార్డు సభలు ఘనంగా నిర్వహించాలి

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)

99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భాగంగా ఎప్రిల్ 2వ తేదీన గ్రామ సభలను నిర్వహించాలని అన్నారు. ఈ గ్రామసభలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి, వారిచే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు. ఈ గ్రామ సభల్లో మహిళలు, మహిళా సంఘాలతో పాటు, అన్ని వర్గాల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాదు నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్ సమావేశమందిరం నుంచి పాల్గొన్నారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలని చెప్పారు. ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. ఈ గ్రామ సభలలో అధికారులంతా పాల్గొంటూ, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఈ గ్రామ సభల్లో భాగంగా ప్రజల ఉన్నతికి ప్రభుత్వం అమలుచేస్తున్న, రానున్న రోజుల్లో అమలుపరిచే పథకాల వివరాలు వెల్లడించాలని చెప్పారు. అలాగే పలు పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని వివరించారు. దీంతోపాటుగా ఆర్థికంగా, సామాజికంగా లబ్ధి పొందిన లబ్ధిదారులచే సభల్లో మాట్లాడించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభల్లో పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. రేపు గ్రామ, వార్డు సభల నిర్వహణకు సంబంధించి, సంబంధిత అధికారులు, ప్రత్యేక అధికారులు ప్రిపరేటరీ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ, వార్డు సభలకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ విసిలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

బెజ్జూర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)

బెజ్జూరు గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్గం సరోజ పై జిల్లా కలెక్టర్, బెజ్జూర్ ఎంపీడీవోకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు పదవ వార్డు సభ్యుడు రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో సర్పంచ్ హాజరుకాకుండా భర్త దుర్గం తిరుపతి, బీఆర్ఎస్ నాయకునితో కలిసి పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. వారిద్దరూ కలిసి గ్రామపంచాయతీలో కూర్చొని సర్పంచ్ చేయవలసిన పనులు చేస్తూ అజమాయిశి చేస్తున్నారని ఆరోపించినట్లు తెలిపారు. ఈ విషయంలో సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీ దుర్గం చిన్నయ్య మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీష్ రావు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ ఆయనకు పెళ్లి పత్రికను అందజేశారు. వచ్చే నెల ఏప్రిల్ 12వ తేదీన జరగనున్న తన కుమార్తె వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఈ సందర్భంగా హరీష్ రావును చిన్నయ్య కోరారు. దుర్గం చిన్నయ్య మరియు వారి కుటుంబ సభ్యులు హరీష్ రావు గారికి శుభలేఖను అందించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఆహ్వానంపై హరీష్ రావు సానుకూలంగా స్పందిస్తూ, వివాహ వేడుకకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. చిన్నయ్య కుటుంబ సభ్యులతో పాటు పలువురు ముఖ్య అనుచరులు పాల్గొన్నారు.

# అకాల వర్షానికి వరి పంటకు తీవ్ర నష్టం



లోకేశ్వరం, మార్చి 31 (ప్రభాత సమాచారం)

సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి రైతులు అరిగోస పడుతున్నారు. లోకేశ్వరం మండలంలోని కనకాపూర్, అబ్దుల్లాపూర్, జోహార్ పూర్,వాస్తాపూర్, ధర్మోరా,పంచగుడి తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పైరు నేలకొరిగింది.వరి కంకి పాలు పోసుకునే దశలో ఉండడం వల్ల నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లే ఆస్కారం ఉన్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20000 వరకు పెట్టుబడి పెట్టడం జరిగిందని, దీనితో సగం దిగుబడులు తగ్గిపోయేలా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సోమవారం అర్ధరాత్రి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆకాల వర్షంతో పాటు భారీ ఈదురు గాలులు వీచాయి. దీనితో కోత దశలో ఉన్న మొక్కజొన్న పంటకు ఎలాంటి నష్టం వాటిల్లే ఆస్కారం లేదు. కాని ముందుగా వరి నాట్లు వేసిన ప్రాంతాల్లో మాత్రం వరి పైరు నేలకు ఒరిగింది. దీనితో రైతులకు నష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. నష్టం వివరాలు అంచనా వేయాలని ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఒకవేళ ఆదేశాలు వస్తే వివరాలు సేకరించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తాం.



## ఏసీపీ కిరణ్ కుమార్‌ను కలిసిన చిలుక రాజనర్సు

బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లికి నూతనంగా బదిలీపై వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ కిరణ్ కుమార్ గారిని మంగళవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిలుక రాజనర్సు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీకి పూలబొక్కే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు పట్టణంలోని పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా బెల్లంపల్లి బజార్ ఏరియా మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, డివైడర్ల మధ్య ఉన్న అనవసరపు యూ–టర్న్‌లను మూసివేసి రోడ్డును క్రమబద్ధీకరించడం పట్ల రాజనర్సు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను గమనించి ఏసీపీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు.ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ బెల్లంపల్లి డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందర పోలీసులకు సహకరించాలి ప్రజలు తమకు ఏవైనా సమస్యలు ఉంటే ధైర్యంగా పోలీసులను ఆశ్రయించి, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు.





# గ్రామ, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

**మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామసభలు/వార్డు సభలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామసభలు/వార్డు సభలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రణాళిక ప్రకారం గ్రామసభలు/వార్డు సభలు నిర్వహించాలని, ఈ సభలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. గ్రామసభలు/వార్డు సభలు మొదటగా తెలంగాణ గీతంతో ప్రారంభించి, సంబంధిత సర్పంచులు, కౌన్సిలర్లు/కార్పొరేటర్ల ప్రారంభ ఉపన్యాసం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించాలని తెలిపారు. గ్రామసభలు/వార్డు సభలలో సంబంధిత గ్రామ/వార్డు ప్రజలకి రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతు భరోసా, గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించాలని తెలిపారు. అర్హులైన వారికి పథకాలను అందించేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. సభలలో ప్రజలతో మాట్లాడించాలని, గ్రామసభల కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభించే ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకాలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి జిల్లాలో కళాకారులు అందుబాటులో ఉన్నారని, వారి ద్వారా ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఇకపై మ్యానువల్ టోకెన్ల జారీ ఉండదని, ఏప్రిల్ 1వ తేదీ నుండి ఇసుక రవాణాను ఆన్ లైన్ ద్వారా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు/వార్డు సభల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని, సంబంధిత ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా సభలు నిర్వహించే ప్రాంతాలలో ఫ్లెక్సీలు/బ్యానర్లు ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశం కొరకు ఆడియో సిస్టం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక ఏర్పాట్లు, త్రాగునీరు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గ్రామసభలు/వార్డు సభలలో స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



---



## స్కోచ్ అవార్డులు అందుకున్న కలెక్టర్‌కు అధికారుల అభినందన

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
ఇటీవలి డిల్లీ వేదికగా రెండు స్కోచ్ అవార్డులు అందుకున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు పలువురు అధికారులు, మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో అభినందించారు. పుష్పగుచ్ఛాలను అందించి, శాలువాలతో సన్మానించారు. పొనికివనం ఏర్పాటు, అమ్మరక్షిత కార్యక్రమాలను విజయవంతంలో ఎంతో కృషి చేశారని అధికారులు కొనియాడారు. అమ్మరక్షిత కార్యక్రమం అమలులో కీలక భూమిక పోషించి, స్కోచ్ అవార్డు రావడంలో కృషి చేసిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్ ను అధికారులు శాలువాలతో సన్మానించారు. కలెక్టర్ ను అభినందించినవారిలో ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, డిఈఓ భోజన్న, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్ ఉన్నారు.

# ప్రజా పాలన ప్రతిబింబించేలా గ్రామసభలు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
**జూన్ 2 నుంచి 'ఇందిరమ్మ జీవిత బీమా' అమలు**
**ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలి**
**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి ఆదేశం**





**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా గ్రామసభలను నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం' అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి ప్రతిష్టాత్మకమైన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. గ్రామసభలే ప్రజా వేదికలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే గ్రామసభల్లో ప్రజలకు అందించే సమాచారం ఏకరూపంగా ఉండాలని, ప్రభుత్వ ఉద్దేశం వివరించడంలో ఎటువంటి లోపాలు ఉండకూడదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ సభలను ముఖ్యమంత్రి సందేశంతో ప్రారంభించి, వార్డు సభ్యుల నుంచి ఎంపీలు, మంత్రుల వరకు అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్ల వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామాల్లో చదివి వినిపించాలని, లబ్ధిదారుల అనుభవాలను ప్రజలతో పంచుకోవాలని చెప్పారు.

**విద్యా, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి...**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు లేదా రాగిజావ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు. సాంస్కృతిక శాఖ కళాకారుల ద్వారా ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజల్లో ప్రభుత్వంపై భరోసా కల్పించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేయాలని, ప్రగతి ప్రణాళిక అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

**ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్త సభలు: సీఎస్ రామకృష్ణారావు**
అనంతరం సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, పారిశుద్ధ్య కార్యక్రమాలకు విశేష స్పందన లభించిందని, అదే స్ఫూర్తితో ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామసభలతో పాటు మున్సిపాలిటీల్లో వార్డు సభలు కూడా నిర్వహించి, ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను రికార్డు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మటె, డీఆర్డీఏ పీడీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

---

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

# అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ నస్పూర్ పరిధిలోని తాళ్లపల్లి, సింగాపూర్, గుత్తేదారుపల్లి ప్రాంతాలలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనుల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న బయో మైనింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, ఆండాళమ్మ కాలనీ డంపింగ్ యార్డులో బయో మైనింగ్ పనులు పూర్తి అయ్యాయని, ఈ ప్రాంతంలో త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాళ్లపల్లి, సింగాపూర్ రిహాబిలిటేషన్, రీ సెటిల్మెంట్ కాలనీలో సందర్శించి పారిశుద్ధ్య పరిస్థితులు, మురుగు కాలువ వ్యవస్థ నిర్వహణ పరిశీలించి క్రమం తప్పకుండా శుభ్రత చర్యలు చేపట్టాలని, డివిజన్ పూర్తి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.





ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్థానిక ప్రజలతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలు వివరాలను తెలుసుకున్నారు. రుణాల మంజూరు విషయంలో తలెత్తిన ఇబ్బందులు, పారిశుద్ధ్య సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా పర్యవేక్షించాలని తెలిపారు అనంతరం నెన్నెల మండలంలోని గ్రామపంచాయతీలలో పర్యటించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుతీరును పరిశీలించారు. చెత్త సేకరణ, అంతర్గత రహదారుల శుభ్రత, మురుగు కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా క్రమం తప్పకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడగా బిల్లుల మంజూరులో ఆలస్యం జరుగుతుందని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, గృహ జ్యోతి ఇతర సంక్షేమ పథకాల అమలు వివరాలను తెలుసుకొని పథకాల నిర్వహణలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ కార్పొరేటర్, నెన్నెల మండల పరిషత్ అభివృద్ధి అధికారి హై, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట

## రూ. 158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తం రూ. 157.97 కోట్లతో (సుమారు రూ. 158 కోట్లు) అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాలపరిమితిని మరో ఏడాది



పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రీన్ బడ్జెట్ కింద మున్సిపల్ చట్టం ప్రకారం 10% నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించి, వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నల్లా పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ రోహిత్, వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





### ప్రతీ ఉద్యోగి జీవితంలో

# పదవీ విరమణ సహజం

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం రాత్రి కలెక్టర్ లోని సమావేశ మందిరంలో జిల్లా హౌసింగ్ పిడి గా బాధ్యతలు నిర్వర్తించి, ఈరోజు పదవీ విరమణ పొందిన రాజేశ్వర్, లోకేశ్వరం తహసిల్దార్ గా పని చేస్తూ పదవీ విరమణ పొందిన భోజన్నలకు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా గృహనిర్మాణ అధికారిగా రాజేశ్వర్, రెవెన్యూ శాఖకు భోజన్న లు చేసిన సేవలు గొప్పవని చెప్పారు. ఇరువురి పదవీ విరమణ అనంతర జీవితం సుఖశాంతులతో, కుటుంబ సభ్యులతో గడపాలని కాంక్షించారు. ఇరువురి పదవీ విరమణ ఆయా శాఖలకు తీరని లోటు అని తెలిపారు. అంతకుముందు పలువురు అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ, ఇరువురు వారి వారి శాఖలకు చేసిన సేవలు కొనియాడారు. పదవీ విరమణ పొందిన అధికారుల దంపతులకు ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులు శాలువాలతో సన్మానించారు. బహుమతులు అందించారు. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, ఇతర అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులుపాల్గొన్నారు.

# ఏప్రిల్ 2న గ్రామసభ

**జన్నారం, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచా యతీలో ఏప్రిల్ 2న ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీ ఆవరణలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నట్లు సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఈవో రాహుల్ తెలిపారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఈ గ్రామసభలో స్పష్టంగా వివరించనున్నారు. గ్రామ సమస్యలు, ప్రగతిపై చర్చించేందుకు వార్డు సభ్యులు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' పథకం భరోసా





## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రం లోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ పథకం ప్రారంభం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా వారు సుమారు 10,000 కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం కింద సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించు కున్నరని, ఛార్జీల రూపంలో ఆదిలాబాద్ డిపో 106 కోట్లు, ఉట్నూరు డిపో 28 కోట్ల రూపాయలకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, త్వరలోనే ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని ప్రకటించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, పి.హెచ్.సి కేంద్రాల ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టును మొదలుపెడతామని తెలిపారు. అలాగే, మహిళలు బస్సుల్లో ప్రయాణించడమే కాకుండా, స్వయంగా బస్సులను నడిపేలా జిల్లా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులను కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. పథకం ద్వారా ఆదా అయిన సొమ్మును మహిళలు తమ కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పిడి రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిఎం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగాలి



**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా విశిష్ట సేవలందించిన కడారి రాజలింగు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన "ఆత్మీయ సన్మాన మహోత్సవం" ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని, రాజలింగు దంపతులకు శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాజలింగు తన సేవా కాలంలో బీసీ వర్గాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసి, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు చేరువ చేశారని ప్రశంసించారు. ఆయన నిబద్ధత, నిజాయితీ, ప్రజల పట్ల సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కడారి రాజలింగు మాట్లాడుతూ, తన సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యను సద్వినియోగం చేసుకోవాలి

## పివిటిజి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గురుకుల విద్యను జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పివిటిజి గురుకుల ప్రిన్సిపాల్ సుజాత ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ తరగతులలో ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పి వి టి జి గురుకులంలో మూడవ తరగతిలో 80, నాల్గవ తం̐గతిలో 49, ఐదవ తరగతిలో 56, అరవ తరగతిలో 18, తొమ్మిదవ తరగతిలో 13 ఖాళీలు ఉన్నట్లు తెలిపా రు. జిల్లాలోని పివిటిజి తెగకు చెందిన విద్యార్థులు మే 30లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకొని నాణ్యమైన గురుకుల విద్యను పొందాలన్నారు.

# అకాల వర్షంతో అతలాకుతలం







**అన్నదాతలను దెబ్బతీసిన అకాల వర్షం..**
**ఈదురు గాలులతో మామిడి, వరి, మొక్క జొన్నకు నష్టం**
**ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు**

మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం)

**అన్నదాతల ఆశలు నేలరాలాయి. సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి జిల్లా వ్యాప్తంగా మామిడి, మొక్కజొన్న, వరి పంటలు సగానికి పైగా దెబ్బతిన్నాయి. ఎన్నో ఆశలతో రైతులు కష్టపడి పండించుకున్న పంటలు ఒక్క రాత్రితో కోలుకోలేని దెబ్బతీశాయి. బలమైన గాలులు వీయడంతో మామిడి కాయలు నేలరాలాయి. మొక్కజొన్న పంట పూర్తిగా వాలిపోయి తీవ్ర నష్టం తెచ్చిపెట్టింది. అలాగే మరికొద్ది రోజుల్లో కోతలకు సిద్ధమవుతున్న వరి పంట కూడా అన్నదాతలకు అపార నష్టం తెచ్చిపెట్టింది. ఇక మరి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్థంభాలు కూలడం..పెద్దపెద్ద వృక్షాలు నేల కూలాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో చేతికి వచ్చిన 2143 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా, 1792 ఎకరాల్లో మొక్కజొన్న, 351 ఎకరాల్లో వరి పంటకు నష్టం కలిగినట్లు అంచనా..**

మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షం మామిడి రైతులకు అపార నష్టం మిగిల్చింది. బలమైన ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలాయి. గాలివేగానికి కిందపడిన కాయలు పగిలి పనికి రాకుండా పోయాయి. ఈ ఏడు ప్రతికూల పరిస్థితులు, చీడపీడల దాడితో మామిడి అం తంత మాత్రమే కాసింది. కాతను కాపాడుకుని కొంతలో కొంతైన నష్టం పూడ్చుకోవాలనుకున్న రైతుల ఆశలు నీరుగారిపోయాయి. చెట్లకు ఉన్న నాలుగు కాయలను ఈదురుగాలులు ఊడ్చుకెల్లాయని రైతులు వాపోతు న్నారు. మండలంలోని మన్నెగూడం, నందులపల్లి, ఘన్‌పూర్, మైలారం, గొల్లపల్లి, చిత్తాపూర్, ఆవడం, మెట్‌పల్లి, నార్వాయిపేట, కొత్తూరు, జెండా వెంకటాపూర్, జోగాపూర్ తదితర గ్రామాల రైతులు నష్టపోయారు. ఈ అకాల వర్షంతో వరి, మక్క రైతులు కూడా నష్టపోయారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి, నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని మండల రైతులు కోరుతున్నారు. లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో బారీ వర్షం కురిసింది. మొక్కజొన్న పంటలు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. మంగళవారం ఉదయం వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో తిరుగుతు నష్టపోయిన పంటలను పరిశీలించారు. మండలంలో సుమారు 200ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టపోయినట్లు అంచనా వేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ తెలి పారు. మండలంలో వీచిన గాలివానకు సుమారు ఆరు విద్యుత్ ఫోల్స్ దెబ్బతినడంతో సమాచారం అందుకున్న అధికారులు మరమ్మతులు జరిపారు. శ్రీరాంపూర్‌లో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో 7వ డివి జన్ పరిధిలో నాలుగు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఎస్‌డీ క్వార్టర్స్ లోని పోస్టాఫీస్ లైన్‌లో చెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడడంతో నాలుగు కరెంటు పోళ్లు విరిగి కిందపడ్డాయి. విషయం తెలుసుకున్న మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, 7వ డివిజన్ కార్పొరేటర్ వేల్పుల రవీందర్‌తో కలిసి విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. వెంటనే సింగరేణి అధికారు లతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. చెన్నూరు మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడి న వర్షానికి మామిడికాయలు నేలరాలాయి. సుద్దాల, కన్నెపల్లి, బుద్దారం, లంబడిపల్లి, సంకారం, అంగ్రాజ్‌పల్లి, ఎర్రగుంటపల్లి, కొమ్మెర, లింగంపేట, కిష్టంపేట గ్రామాల్లో మామిడికాయలు నేలరాలిపోయాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

**ముథోల్‌లోకాల వర్షానికి రైతులకు అపారనాష్టం**

**ముథోల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
అకాల వర్షానికి రైతులకు అపార నష్టం వాటిల్లింది. మంగళవారం ఉదయం వరకు వీచినా గాలి వర్షానికి రైతులు పంట నష్టపోయారు . మండలంలోని వివిధ గ్రామాలలో మొక్కజొన్న, వరి,మామిడి,చింత కాయ, జొన్న పంట సైతం నేలకొరిగాయి చేతికి వచ్చే సమయంలో పంట భూమి పాలు కావడంతో రైతులు కన్నింట పర్వతం అవుతున్నారు. అప్పు తెచ్చి సాగు చేస్తే అపారనాష్టం వాటిల్లిందని వాపోతున్నారు. అధికారులతో సర్వే చేయించి, ప్రభుత్వము రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.





## ఇళ్లగణన పకడ్బందీగా చేపట్టాలి

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో జనగణన 2027లో భాగంగా మొదటి విడత ఇళ్లగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హరిత అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి చార్జ్ అధికారులు, ఫీల్డ్ అధికారులు, సాంకేతిక సిబ్బందికి మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా చార్జీ అధికారులుగా వ్యవహరిస్తున్న తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

## పదవీ విరమణ పొందిన ఏఎస్ఐలకు సన్మానం

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించి, నేడు పదవి విరమణ పొందుతున్న డల్లు సింగ్, శంకర్, మారుతి, నారాయణ రెడ్డి లను, జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో సన్మానం చేస్తారు. పోలీసు శాఖలో సుదీర్ఘ కాలంగా పనిచేసిన వారి సేవలను కొని ఆడారు. ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏవో యూనుస్ అలీ, పోలీస్ ఆఫీసర్స్ అధ్యక్షులు విరాసత్ అలీ ఉన్నారు.



# భైంసా పట్టణ అభివృద్ధికి సహకరించండి

### మున్సిపల్ సమావేశంలో వాడివేడిగా చర్చ




**ముథోల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
పట్టణ అభివృద్ధికి మున్సిపల్ సభ్యులు అధికారులు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తూము దత్త్రాత్రేయ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ను ప్రవేశపెట్టారు. చైర్మన్ దత్తాత్రి మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధికి అన్ని విధాల సహకరించాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ గౌరీష్ బడ్జెట్ వివరాలు తెలుపుతూ 2026 27 ఆర్థిక సంవత్సరానికి 12.10 కోట్ల అంచనాలతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. సందర్భంగా వివరాలు వెల్లడిస్తుండగా పట్టణ ప్రగతికి ఒకటి 1.50 నిధుల గురించి ప్రస్తావించగా ప్రతిపక్ష నాయకుడు మహమ్మద్ జాబీర్ అహ్మద్ మాట్లాడుతూ... అసలు ఆ పథకమే లేదని నిధులు ఎలా వస్తాయని అధికారులను నిలదీశారు. దీంతో కమిషనర్ నవీన్ అధికారులు తడబడ్డారు. ఈ విషయమై సభ్యులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. కలెక్టర్ సంతకంతో తమకు వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొద్ది విరామం అనంతరం తిరిగి సమావేశాన్ని కొనసాగించారు. ఎజెండాలోని 9 అంశాలను ప్రస్తావించి ఆమోదించారు. సమావేశంల మహమ్మద్ జాబీర్ అహ్మద్ వార్డు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బిబి ఖతీజ , వార్డు సభ్యులు డి ఈ ఈ సంతోష్ పాల్గొన్నారు. బడ్జెట్ పద్దులో పట్టణ ప్రగతి నిధులు కావని అవి ప్రజాపాలన సంబంధించినవని మున్సిపల్ చైర్మన్ తూము దత్తాత్రి సమావేశా అనంతరం విలేకరులకు వివరించారు.

# మహాలక్ష్మి పథకం మహిళలకు ఓ వరం



**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
మహాలక్ష్మి పథకం మహిళలకు ఓ వరం లాంటిది అని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకం ప్రత్యేక కార్యక్రమంలో హాజరై ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా గత నెల 29వ తేదీ నాటికి జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు 77 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని చెప్పారు. చిన్నచిన్న వ్యాపారాలు, వీధి వ్యాపారాలు చేసే మహిళలు ఉచిత ప్రయాణం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని తెలిపారు. గతంలో ఏదైనా పని ఉన్నట్లయితే పురుషులు మాత్రమే వెళ్లేవారని, ఇప్పుడు మహిళలే ఆ పనులను పూర్తిచేసుకుని వస్తున్నారు. ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని ఈ పథకాన్ని అమలు చేస్తారని గుర్తు చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్. ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఇండ్ల గణన పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



## హిందూ సమ్మేళనం కరపత్రం విడుదల

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
కుభీర్ గ్రామంలోనీ శ్రీ విట్టలేశ్వర ఆలయం నందు జరగబోయే హిందూ సమ్మేళనం కార్యక్రమం ఈనెల 7న నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం కరపత్రం విడుదల చేశారు. కుభీర్ ఉప మండలము నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగలరని కమిటీ అధ్యక్షులు అరవింద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలోశ్రీ భువనేశ్వరి పీఠాధిపతులు పూజ్య శ్రీశ్రీ కమలానంద భారతి స్వామీజీ పాల్గొని, గోమాత పూజ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయన్నారు.

# ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రమిది



"భారతీయ చిత్రసీమలో గొప్ప ప్రేమకథలు చాలానే ఉన్నాయి. త్వరలో మా 'చెన్నై లవ్‌స్టోరీ' కూడా అందులో ఒకటిగా నిలవనుంది" అన్నారు కథానాయకుడు కిరణ్ అబ్బవరం. ఆయన.. శ్రీ గౌరి ప్రియ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రవి నంబూరి తెరకెక్కిస్తున్నారు. నిర్మాత ఎస్‌కేఎన్‌తో కలిసి సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "గుర్తుందా.. గుర్తుందా" అంటూ సాగే ఈ పాటకు మణిశర్మ స్వరాలు సమకూర్చగా.. అనంత శ్రీరామ్ సాహిత్యమందించారు. హరిచరణ్, శ్రుతిక సముద్రాల ఆలపించారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "ఈ 'గురుతుందా.. గురుతుందా' పాటలాగే ఈ సినిమా కూడా ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇది నా గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. దీంట్లో నా పాత్ర చాలా సెటిల్డ్‌గా ఉంటుంది. ఈ చిత్రంలో రవి రాసిన డైలాగ్స్ నటుడిగా నన్ను మరింత ఉత్సాహపరిచాయి. సాయి రాజేశ్ కథ చెప్పినప్పుడే ఈ సినిమా బలంగా ఉండనుందని అర్థమైంది. ఈ చిత్రంలో మొత్తం ఏడు పాటలున్నాయి. ఇది విడుదలైన రోజు థియేటర్లలో మణిశర్మ కాన్సర్ట్ జరిగినట్లు ఉంటుంది" అన్నారు. "ఈ సినిమాలో ప్రతి ఫ్రేమ్, ప్రతి సీన్, డైలాగ్ అందర్నీ అలరిస్తుంది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు రెట్టింపుగా మనసుల్ని హత్తుకునే చిత్రమవుతుంది. త్వరలో మా విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. దర్శక నిర్మాత సాయి రాజేశ్ మాట్లాడుతూ.. "ఈ సినిమా కొంత భాగాన్ని నేను చూశా. కన్నీళ్లు ఆపుకోలేకపోయా. రవి అంత బాగా తెరకెక్కించారు. ఇది కిరణ్‌కు జ్ఞాపకంలా గుర్తుండిపోయే చిత్రమవుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో రవి నంబూరి, మణిశర్మ, అనంత శ్రీరామ్, గౌరి ప్రియా, ధీరజ్ మొగిలినేని, విప్లవ్, విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.



# 'అనకాపల్లి' వచ్చేస్తోంది!

దర్శకుడు త్రినాథరావు నక్కిన కీలక పాత్రలో నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. దీనికి ఆయనే కథ, స్క్రీన్‌ప్లే అందించగా.. ఖగేశ్ తమ్మినేని దర్శకత్వం వహించారు. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ఠ నాయకానాయికలుగా నటించారు. కంద్రేగుల నాయుడు నిర్మాణ భాగస్వామిగా ఉన్నారు. ఈ సినిమా ఈ వేసవిలోనే థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. "అనకాపల్లి.. ఇక్కడ కావాల్సింది దక్కాలంటే.. ఎదుటోడికి మనమంటే భయం ఉండాలి. భయం లేనోడికి పిడికిలి రుచి.. అదీ తెలిసినోడికి ఓటు రుచి చూపించాలి" అనే డైలాగ్‌తో సాగిన టీజర్ ఆద్యంతం అలరించింది. ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి.. ఇది యువతరం మెచ్చే ప్రేమకథతో పాటు రా రస్టిక్ యాక్షన్ అంశాలతో మిళితమై ఉన్న చిత్రమని అర్థమవుతోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: దేవ్ జండ్, ఛాయాగ్రహణం: మాయా వి.



# హెబ్బా పటేల్ హాట్ షో

మోస్ట్ హాటెస్ట్ బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈమె కుమారి 21ఎఫ్ సినిమాతో ఓవర్‌నైట్‌లోనే మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఆ సినిమా తర్వాత అనేక చిత్రాల్లో నటించినప్పటికీ, కొన్ని సినిమాల ద్వారానే మంచి విజయాలను అందుకుంది.ఇటీవలి కాలంలో ఈమె నటించిన సినిమాలు పెద్ద స్థాయి విజయాలను అందుకోలేకపోయాయి. తాజాగా ఈ నటి ఈషా అనే హర్రర్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించింది. మంచి అంచనాల నడుమ విడుదలైన ఈ సినిమా కూడా ఈ ముద్దుగుమ్మకు నిరాశనే మిగిల్చింది.సినిమాల్లో తన అందాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ హీరోయిన్ సోషల్ మీడియాలో కూడా అదే జోరును కొనసాగిస్తోంది. తరచూ తన సోషల్ మీడియా ఖాతాల్లో హాట్ ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. అందులో అనేక ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా హెబ్బా పటేల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని కొత్త ఫోటోలను షేర్ చేసింది.ఆ ఫోటోలలో ఈ బ్యూటీ లైట్ బ్రౌన్ కలర్ స్లీవ్‌లెస్ టాప్ మరియు బ్లూ జీన్స్ ధరించి స్టైలిష్‌గా నిలబడి ఫోజులు ఇచ్చింది. అలాగే చేతులను జేబుల్లో పెట్టుకుని, నడుమును స్వల్పంగా వెనక్కి వంచి స్టైలిష్ లుక్‌లో కనిపించింది. తాజాగా ఈ హీరోయిన్ షేర్ చేసిన ఈ ఫోటోలు స్టైలిష్ మరియు హాట్ లుక్‌లో ఉండటంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు



**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**
**ముందస్తు అనుమతులు లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం.**
**ఈనెల 30 తారీఖు వరకు నిబంధనలు వర్తిస్తాయి**
**నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు.**
**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ**

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి ఏప్రిల్ ఒకటి నుండి 30 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేస్తూ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ – 1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు. ఎవరిని కూడా రెచ్చగొడుతూ సోషల్ మీడియాలో పెట్టినా, ఘర్షణలకు దిగిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని, అదే విధంగా నిబంధనలను అతిక్రమించి ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.



## గ్రంథాలయానికి పుస్తకాల విరాళం

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులకు ఉపయోగ పడే విధంగా పుస్తకాల విరాళాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ పరీక్షల సహాయ అధికారి మర్యాల ఉదయ బాబు గ్రంథాలయానికి మొత్తం 70 పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ పుస్తకాలు ఇంజనీరింగ్, మెడిసిన్, లాకాంపిటీటివ్ పరీక్షలు, పౌరాణిక అంశాలకు సంబంధించినవిగా ఉండి విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్‌లు టి.సదానందం, క.ప్రవీణ గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ నేతకు బిజెపిలో సముచిత స్థానం

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో తనకు సముచిత స్థానం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని వి సత్యనారాయణ గౌడ్ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించగా నిర్మల్ చెందిన బీసీ నేత మాజీ జెడ్పి చైర్మన్ వల్ల కొండ సత్యనారాయణ గౌడ్ కు అవకాశం దక్కింది. ఇప్పటికి ఆయన నిర్మల్ ఎంపీపీగా, కాకతీయ పాలకవర్గ సభ్యులుగా, ఉమ్మడి జిల్లా ,జడ్పీ చైర్మన్ గా పనిచేసి 2023లో బిజెపిలో చేరారు. అప్పటినుండి పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్న ఆయనకు రాష్ట్ర కమిటీ లో అవకాశం దక్కడం పట్ల బీసీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి విధేయతగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

# గ్రామాభివృద్ధే మా లక్ష్యం: సర్పంచ్

**వాంకిడి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జంబుల్దారి గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ కొమరం పవన్ తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించడం గ్రామానికి మరింత సౌకర్యాలను తీసుకురావడంలో భాగమని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, రోడ్లు, పారిశుధ్యం వంటి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్నులే విట్టల్, వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్నులే నారాయణ, డి.కొండ మహేష్, ఉప్పల కృష్ణతో పాటు కార్యదర్శి సత్యనారాయణ, కరోబార్ హరిదాస్, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**లేక పోతే ఏప్రిల్ 1 నుంచి నిరవధిక సమ్మె - మిషన్ భగీరథ కార్మికుల హెచ్చరిక**

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పనిచేస్తున్న మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించకపోతే ఏప్రిల్ 1 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. మంగళవారం జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మండల తహసిల్దార్ రియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మికుల జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వేతనాల కోసం పలుమార్లు యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ సరైన స్పందన లభించలేదన్నారు. వేతనాలు అందక కార్మికులు కుటుంబాలను పోషించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిల్లల చదువులు కూడా కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఆసిఫాబాద్ సెగ్మెంట్‌లో పనిచేస్తున్న సుమారు 600 మంది కార్మికులు ఏప్రిల్ 1 నుంచి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలోకి దిగుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి చిరంజీవి, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాపిడి బాలేష్ తదితరులు పాల్గొన్నారు.






## రోడ్డు ప్రమాదాల
# నివారణ అందరి బాధ్యత

**బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్**

**స్పెషల్ డ్రైవ్ చేపడతాం - నేత్ర వైద్య శిబిరం**

**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అన్నివైపుల నుంచి చర్యలు తీసుకుంటున్నామని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. బెల్లంపల్లి పద్మశాలి భవనంలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ కిరణ్ కుమార్ హాజరైమాట్లాడుతూ... నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లనే వేలమంది ప్రాణాలు రోడ్డు ప్రమాదాల్లో కోల్పోతున్నారన్నారు. ప్రతిరోజు, ప్రతి గంటకు వందల మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని వాపోయారు. కంటి చూపు లోపం కూడా రోడ్డు ప్రమాదాల్లో ఒకటిగా గుర్తించి ఆటోడ్రైవర్లకు నేత్ర వైద్యశీ కోసం కంటి పరీక్షలు చేపిస్తున్నామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలను నడిపితే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ప్రజల్ని క్షేమంగా గమ్యం చేర్చే బాధ్యతను వారెప్పుడూ విస్మరించ కూడదని గుర్తు చేశారు. అటు ప్రయాణికులు, ఇటు తమ కుటుంబ సభ్యుల జీవితాలు ఆటో డ్రైవర్లపైనే ఆధారపడి ఉంటున్నారు. ప్రతి ఆటో డ్రైవర్ ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వారం రోజుల్లోనా ప్రతి వాహనదారుడు సంబంధిత వాహన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఆ తరువాత బెల్లంపల్లిలో స్పెషల్ డ్రైవ్ చేపడతామని తెలిపారు. ఇక ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడికి లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ కలిగి ఉండటం వారి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి జాగ్రత్తలు కూడా ప్రత్యేకంగా తామే చెప్పాల్సిరావడం దురదృష్టకరమనీ వాపోయారు. పోలీసులుగా శాంతి భద్రతలతో పాటు ప్రజల వ్యక్తిగత జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నివారణ కూడా తమ విధుల్లో భాగం చేసుకున్నామన్నారు. ఈ విషయంలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఆప్తమాలజిస్టులు అంజయ్య బృందం కంటి పరీక్షలు నిర్వహించింది. తగిన వైద్యం చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్, లైన్స్ క్లబ్ ప్రతినిధులు అరుణ సుందరి, వినోద్ ,నర్సింగం పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం మామిడి రైతులకు తీవ్ర నష్టం





**జన్నారం, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలో సోమవారం రాత్రి బీభత్సమైన గాలితో కూడిన వర్షం కురవటంతో దేవునిగూడెం కామన్ పెల్లి గ్రామాలలోని మామిడి తోటలలో నేలరాలిన మామిడి కాయలు, దాదాపు 5 లక్షల వరకు పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అకాల వర్షం కారణంగా నష్టమే జరిగిందంటున్న రైతులు, నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకోలు. అలాగే మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ ఈదురుగాలతో కూడిన వర్షానికి జోనూరు మల్లయ్య అనే రైతు పొలంలోని వడ్లు మొత్తం నేలరాలాయి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు

### బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక

# కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

**గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు - సీఎం బాసర పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**





**ముథోల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు. ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







### శాంతిభద్రతలకు విఘాతం

## కలిగిస్తే కఠిన చర్యలు

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్**

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రుల్లో పెట్రోలింగ్ పెంచాలని, బెట్టింగ్, జూదం, మట్కా, గంజాయిలతో పాటు పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెంచాలని ఆదేశించారు. 100 కాల్ తో పాటు ప్రజలు ఫిర్యాదుకు తక్షణమే స్పందించి, న్యాయం చేయాలని సూచించారు. అలాగే ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. కాగా వచ్చే హనుమాన్ జయంతి నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్. డీఎస్పీ వాహిదుద్దీన్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ మహోత్సవం

**జన్నారం, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శ్రీ శ్రీ భక్తాంజనేయ, మహాగణపతి శివ పంచాయతన, స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్తులు హనుమాన్ చిట్టి కమిటీ సభ్యులు సర్పంచ్ వాసాల నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆంజనేయస్వామి భక్తులు హోమాలు, యజ్ఞలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీరామ ఆంజనేయ స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు హనుమాన్ చిట్టి కమిటీ సభ్యులు కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్ నోముల రాజ్ కుమార్ ఓడిపల్లి రాకేష్‌కు అభినందనలు తెలియజేశారు.



## ఎన్నికలకు.. బీఆర్ఎస్ పరిశీలకుల నియామకం



**క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి**
**గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్**
**ఖానాపూర్‌కు జోగు రామన్న, కోవ లక్ష్మి, అనిల్‌జాదవ్**

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 4న నిర్వహించనున్నారు. క్యాతన్‌పల్లితోపాటు కోరం లేక వాయిదా పడిన ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికను సైతం అదే రోజు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికలకు పరిశీలకులను (ఇన్‌చార్జిలు) నియమించింది. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల పరిశీలకులుగా మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్‌కు బాధ్యతలు అప్పగించింది. ఇదే సమయంలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల పరిశీలకులుగా మాజీ మంత్రి జోగురామన్నతోపాటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను పార్టీ నియమించినట్లు తెలిసింది.



## 'పోలీస్ అక్క'కు జాతీయస్థాయిలో గుర్తింపు

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో ప్రజల శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ అమలు చేసిన పోలీస్ అక్కకు జాతీయస్థాయిలో స్కోఫ్ అవార్డు సంతోషంగా ఉందని ఎస్పీ జానకీ తెలిపారు. జిల్లాలో 7500 మంది విద్యార్థులకు పోలీసు అక్క చేయూత అందించిందని, జిల్లాలో శాంతి భద్రతల విషయంలో పోలీస్ శాఖ రాజీ పడి ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇది స్ఫూర్తితో జిల్లాలో ముందుకు వెళ్దామని పేర్కొన్నారు. జిల్లాలో మహిళల ఏర్పాటు చేసిన శివంగి నారి శక్తి కార్యక్రమాలు కూడా ప్రజల్లో మంచి గుర్తింపు తీసుకొచ్చాయని పేర్కొన్నారు.



## వానరాల బెడద.. భయాందోళనలో ప్రజలు

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వానరాల బెడద రోజురోజుకు పెరుగు తోంది. తరుచూ ఇళ్లలోకి చొరబడి వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. వానరాలు గుంపులు గుంపులుగా కాలనీలపై విరుచుకు పడుతున్నాయి. ఇళ్లు, దుకాణాల లో తిను బండరాలు, వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటు పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు పాల్పడుతూ గాయపరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణలో కనీసం పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కోతులు పట్టేందుకు ప్రత్యేక బృందాలు ఉంటాయి. వారికి ఒక్కో కోతికి కొంత డబ్బును పంచాయతీ వారు చెల్లించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో పంచాయతీ అధికారులు పెద్దగా దీనిపై శ్రద్ధ చూపడం లేదు. ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా పట్టించ కోవడం లేదు. జిల్లాలో ఎక్కడ కూడా మంకీ ఫుడ్ కోర్టులు లేక పోవడం, అడవుల్లో సరైన ఆహారం లభించక పోవడంతోనే గ్రామాల్లోకి వానరాల పెద్ద సంఖ్యలో చేరి హంగామా చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇళ్లల్లోకి చొరబడుతున్న కోతులను బెదిరించే ప్రయత్నం చేస్తే మీదపడి కరుస్తున్నాయి. అటవీ ప్రాంతాలు రోజురోజుకు తగ్గి పోవడం వాటికి అడవిలో ఆహారం లభించక పోవడంతో గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. గుంపులుగుంపులుగా కాలనీలలో సంచరిస్తూ వీరంగం సృష్టిస్తున్నాయి. ఇళ్లలో తయా రు చేసుకున్న భోజనలతో పాటు పప్పు దినుసులు పట్టుకెళుతు న్నాయి. కిరణాషాపులు, పండ్ల దుకాణా ల దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడతతో పెంకుటిళ్లులు ధ్వంసం అవుతున్నాయి. అరుబయట ఎండ బెట్టిన పప్పు దినుసులు ఇతర ఆహార పదార్థాలను వదలటంలేదు. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి ఇతర పండ్ల చెట్లు, కూరగాయల చెట్లను సైతం వదలకుండ ధ్వంసం చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే కాకుండా బెజ్జూరు, కెరమెరి, రెబ్బెన, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాల్లోనూ కోతుల బెడత తీవ్రంగా ఉంది. కోతుల బెడద రోజు రోజుకు ఎక్కువ కావడంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో అవి ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కోతి కాటుకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవు తున్నాయి. మిద్దెల మీద గుంపులుగుంపులుగా ఒక చోట చేరి వచ్చి పోయే వారిపై పైపైకి వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.






# మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, ఆర్ టి సి మంచిర్యాల డిపో మేనేజర్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి అనితలతో కలిసి ఎ పి ఎంలు, డిపిఎంలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో మహాలక్ష్మి పథకం అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ద్వారా రాష్ట్రంలోని మహిళలకు దాదాపు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతానికైనా ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు నగదు పొదుపు జరుగుతుంని, తద్వారా ఆ నగదును కుటుంబ పోషణ నిమిత్తం వినియోగించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళల పేరిట పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలలో దాదాపు 5 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రహరీ గోడ, వంటశాల, త్రాగునీరు, అదనపు గదులు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేయబడిన ఏకరూప దుస్తులను సకాలంలో విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా 16 బస్సులు వస్తున్నాయని, ఆర్ టి సి సంస్థకు లీజ్ కి ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టిన ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రాష్ట్రంలో ప్రథమంగా నిర్మాణం పూర్తి చేయబడి ప్రారంభానికి సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ భవన్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవచ్చు అని, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మహిళల సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని అన్నారు. మహిళను కుటుంబ పెద్దగా నిర్ధారించి అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులను మహిళల పేరిట జారీచేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు అన్ని వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందే దిశగా బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ సందర్బంగా మహిళలు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ తాను గతంలో ఎక్కడికైనా వెళ్లాలి అంటే డబ్బుల గురించి ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా అందించిన ఉచిత బస్సు ప్రయాణంతో జిల్లా కేంద్రానికి, బంధువుల ఇండ్లకు, పనుల నిమిత్తం వెళ్లేందుకు ఆధార్ కార్డు తీసుకొని వెళ్లడంతో ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయని తెలిపారు. జైపూర్ మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తనకు సంవత్సరానికి దాదాపు 40 వేల రూపాయలు మిగులుతున్నాయని, రోజువారి పనిమీద తమ గ్రామం నుండి మంచిర్యాలకు వెళ్లాలంటే 100 రూపాయలు ఖర్చు అయ్యేదని, నెలలో 20 సార్లకు పైగా ప్రయాణం చేయవలసి ఉంటుందని తెలిపారు. తద్వారా నెలకు 2 వేల రూపాయల చొప్పున ఆదా అవుతుందని, పని నిమిత్తంతో పాటు బంధువుల ఇండ్లకు, దేవాలయాలకు సంతోషంగా వెళుతున్నానని, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా పొదుపు అయిన డబ్బులను కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు సంఘంలో పొదుపు పెంపొందించుకుంటున్నానని తెలిపారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన లత ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తాను ఇప్పటివరకు 20 వేల రూపాయల వరకు లబ్ధి పొందానని తెలిపారు. శుభకార్యాలకు, షాపింగ్‌కు, దేవాలయాలకు, పిల్లల ఆసుపత్రులకు, బంధువుల కార్యక్రమాలకు వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతతో పాటు వివిధ వ్యాపార రంగాలలో అందిస్తున్న ప్రోత్సాహంతో వ్యాపార రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని, తద్వారా మరింత అభివృద్ధికి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




- ఈదురుగాలుల బీభత్సం.. రైతన్న కన్నీరు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షం
- పంటలు నష్టపోయి నిండా మునిగిన రైతులు
- ఈదురుగాలులు, వడగండ్ల వానతో కన్నీళ్లు
- నేలరాలిన మామిడి.. నేలవాలిన మొక్కజొన్న
- అన్నదాతలను దెబ్బతీసిన అకాల వర్షం
- నష్టం వివరాల సేకరణలో అధికారులు

ఆదుకోవాలని రైతు సంఘాల డిమాండ్

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి మొదలైన ఈదురుగాలుల బీభత్సం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఈదురుగాలులతోపాటు వడగండ్ల వాన కురియడంతో కోతదశకు వచ్చిన వరి పైరు నేలవాలింది. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా నాట్లు పూర్తి చేసిన లోకేశ్వరం, కుంటాల, సారంగాపూర్, నిర్మల్, సోన్ మండలాల్లో వరి కోత దశకు రాగా, ఆయా మండలాల్లోని రైతులకు నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న మక్క, పూత దశలో ఉన్న నువ్వు పంటలు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. నువ్వు పంట పూర్తిగా నేలకొరుగగా, సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోయింది. కాగా.. సోయా చేతికొచ్చిన తర్వాత అక్టోబర్, నవంబర్ మాసాల్లో సాగు చేసిన మక్క పంటకు ఇప్పటికే గింజ గట్టి పడినందున ఈ వర్షంతో పెద్దగా నష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు. పత్తి తర్వాత డిసెంబర్‌లో వేసిన మక్కకు కొంత వరకు నష్టం జరిగే అవకాశం ఉందటున్నారు. ఇప్పటికే చేతికొచ్చిన పసుపు పంటను ఉడకబెట్టి కల్లాల్లో ఆరబోశారు. రాత్రి కురిసిన వర్షంతో ఎండిన పసుపు పంట పూర్తిగా తడిసింది. దీంతో పసుపు రంగు మారి ఆశించిన ధర వచ్చే అవకాశం లేదు. 5,527 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. 3,368 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఈసారి మంచి పూత, కాత ఉండడంతో నిన్న మొన్నటి వరకు మామిడి రైతులు సంతోషించారు. ఈదురుగాలులతో తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని ముథోల్, కుంటాల, కుభీర్, తానూర్, పెంబి, దస్తూరాబాద్, దిలావర్‌పూర్, సారంగాపూర్, లక్ష్మణచాంద, మామడ, సోన్, నిర్మల్ మండలాల్లో పంట నష్టం ఎక్కువగా జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంటలు నష్టపోయిన రైతులకు నయాపైసా పరిహారాన్ని ఇవ్వలేదని రైతులు మండిపడుతున్నారు. ఈసారైనా సకాలంలో నష్టం అంచనాలు రూపొందించి పరిహారాన్ని అందజేయాలని రైతులు కోరుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వానకాలంలో పత్తి, సోయా పంటలను రైతులు నష్టపోయారు. దిగుబడులు సరిగా రాక పెట్టుబడులు కూడా రాలేదు. యాసంగిలో నష్టాన్ని కొంత మేరకు తగ్గిస్తామనుకున్న రైతులను అకాల వర్షం నట్టేట ముంచింది. వారం రోజుల కిందట కురిసిన వర్షం, గాలితో రైతులు జొన్న, మొక్క జొన్న పంటలను నష్టపోయారు. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో కూడా రైతులు మరోసారి నష్టపోయారు. జొన్న, మొక్కజొన్న పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు పంటలు నష్టపోతున్నారు. వానకాలంలో అధిక వర్షాలకు 20 వేల ఎకరాల్లో నష్టం జరిగింది. భారీ గాలులు, వర్షంతో యాసంగిలో వందల ఎకరాల్లో చేతికొచ్చిన పంటలను రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. లక్షల రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో నష్టపోతుండడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. వానకాలంలో పత్తి, సోయా నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. ఫసల్ బీమా పథకం అమలుకాక పోవడంతో బీమా వర్తించడం లేదు. ఫసల్ బీమా పథకం అమలు చేయాలని రైతు సంఘాల నాయకులు ప్రభుత్వానికి పలుమార్లు సూచించినా ఫలితం లేకుండా పోతుంది. ప్రభుత్వం జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం తమకు తీవ్ర నష్టం కలిగించింది. కష్టపడి ఎకరం భూమిలో పసుపు సాగు చేయగా, 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. వచ్చిన పంటను ఉడకబెట్టి వారం రోజులుగా నిరంతరం కాపలా ఉంటూ ఆరబెట్టిన. మరో రెండు, మూడు రోజుల్లో అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకెళ్దామనుకుంటున్న తరుణంలో అకాల వర్షంలో పసుపు పూర్తిగా తడిసింది. తడిసిన పసుపును మళ్లీ ఎండబెట్టినా ఎర్రబారిపోతుంది. ప్రస్తుతం పసుపుకు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.12 వేల నుంచి రూ.13 వేల ధర ఉంది. రంగుమారిన పసుపును రూ.8 వేల నుంచి రూ.9 వేలకు మాత్రమే కొంటరు. అంటే అకాల వర్షం కారణంగా క్వింటాలుకు రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు నష్టపోవాల్సి వస్తున్నది. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పసుపు రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

